www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

కాకినాడ

నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయ 9,11 తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి ఈనెల 8వ తేదీన జరిగే ప్రవేశ పరీక్ష నిర్వహణపై సెంటర్ సూపరింటెండెన్స్, సెంటర్ లెవెల్ అబ్జర్వర్‌లకు అవగాహన కార్యక్రమం జరిగింది. గురువారం నవోదయ విద్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ పిన్సిపల్ కె.రామకృష్ణయ్య మాట్లాడుతూ 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1451 మంది, 11 తరగతి ప్రవేశ పరీక్షకు 699 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పట్టణ పరిధిలో ఏర్పాటుచేసిన 9 కేంద్రాల్లో ఈ పరీక్ష లు నిర్వహించబడతాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ అడ్మిట్ కార్డులు డౌన్లోడ్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఓరియంటేషన్ ప్రోగ్రాం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అట్టహాసంగా పిడిఎఫ్ అభ్యర్థి

డివి.రాఘవులు నామినేషన్

పాల్గొన్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, గోపిమూర్తి ఏలూరులో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల భారీ ర్యాలీ

ఏలూరు నగరంలో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ సందర్భంగా ర్యాలీ

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులోని జొన్నాడ వద్ద అంబేద్కర్‌కు రాఘవులు నివాళి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, సిటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) నామినేషన్ కార్యక్రమం భారీ ర్యాలీతో అట్టహాసంగా సాగింది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుండి వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. స్థానిక సివిటియు కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ మీదుగా కలెక్టరేట్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వికి అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సివిటియు కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2007 నుంచి పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలుపొందిన వారు నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథి శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డివి.రాఘవులు 40 సంవత్సరాలుగా యుటిఎఫ్‌లో వివిధ స్థాయిల్లో పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఎన్నికకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ 20 రోజులు 24 గంటలు పని చేయాలని కోరారు. కూటమి అభ్యర్థికి రాజకీయ, కుల, ధన, బలాలు ఉన్నాయని, మన పిడిఎఫ్ అభ్యర్థికి ప్రజాబలం, కార్యకర్తల బలం, సంఘాల బలం ఉందని తెలిపారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. డివి.రాఘవులు విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏలూరులో నామినేషన్ వేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సిలు వెంకటేశ్వరరావు, ఐ.గోపిమూర్తి, సివిటియు నేత వి.ఉమామహేశ్వరరావు, ప్రజాసంఘం నేత మంతెన సీతారాం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అడిగేవారే లేరని, ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సివిటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సివిటియు ఎటువంటి ఉద్యమం చేసినా రాజకీయాలతో సంబంధం లేకుండా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు సహకరించేవారని గుర్తు చేశారు. ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, బి.బలరాం మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు అంటే అంటే ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థులకే ఓట్లు వేస్తారని, ప్రస్తుతం ఆ సీటు కోసం సంబంధం లేని వారు పోటీ చేస్తున్నారని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుని రాజకీయ పార్టీలవారు లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. దీన్ని తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్, సివిటియు, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కె.ఉమామహేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎస్.బాలాజీ, జ్యోతిబసు, శ్రీదేవి, అరుణకుమారి, రవికుమార్, ముస్తఫా ఆలీ, విజయరామరాజు, రామభద్రం, జయకర్, షరీఫ్, నరేష్, డివిఎస్‌విడి.ప్రసాద్, ఎ.రవి, ఎస్ఎన్.రమేష్, జి.రవికిషోర్, బేబీరాణి, జెఎన్‌వి.గోపాలన్, అరుణ్‌కుమార్, ఐవి.సుధాకర్, కె.రాజా రామ్మోహన్‌రాయ్, ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిసిఎల్ జాయింట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో వలస కార్మికులకు ప్రాధాన్యత తగ్గించి స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు కోరారు. స్థానిక కార్మికుల సమస్యలపై కేంద్ర కార్మిక సంఘాలతో డిసిఎల్ పోలిశెట్టి శ్రీనివాస్ గురువారం జాయింట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలలో పెరుగుతున్న వలస కార్మికుల ప్రభావాన్ని తగ్గించి స్థానికులకు ఉపాధి కల్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే జిల్లాలో భారీ పరిశ్రమలు సైతం కార్మిక చట్టాల నుంచి మినహాయించ బడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు రెగ్యులర్ ప్రాతిపదికన సేఫ్టీ చెకింగ్‌లు చేయాలని కోరారు. జిల్లాలో అనేక పరిశ్రమలు ఈ కాలంలో మూతపడ్డాయని వాటిని ప్రభుత్వమే తెరిపించే ప్రయత్నం చేయడం ద్వారా ఉన్న ఉపాధిని కాపాడాలని కోరారు. జిజిహెచ్‌లో పనిచేసే మెస్, శానిటేషన్ కార్మికులకు గత కాంట్రాక్టర్ చెల్లించాల్సిన పిఎఫ్ బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా డిసిఎల్ పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులందరి చేత ఈ శ్రమ నమోదు చేయించాలని కార్మిక సంఘాలను కోరారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, తమ పరిధి కాని సమస్యలను ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సివిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకారమణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, వివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణ అందించేలా బీచ్‌ను పరిశుభ్రంగా తీర్చి దిద్దాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం రూరల్ మండలం వాకలపూడి బీచ్‌ను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. బీచ్ పరిశుభ్రతకు చేపడుతున్న చర్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. బీచ్ క్లీనింగ్, భవిష్యత్తులో చేపట్టబోయే నూతన ప్రాజెక్టుల ఏర్పాటు వివరాలు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బీచ్‌కు వచ్చే సందర్శకులకు ఆహ్లాదకరమైన, అనువైన వాతావరణం కల్పించాలన్నారు. బీచ్ పార్కుకు వచ్చే సంద ర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బీచ్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు తగు చర్యలు చేపట్టాల న్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వ యంతో పని చేయాలని ఆదేశించారు. పర్యావర ణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తులో బీచ్ పార్క్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు చేపట్టబోయే నూతన ప్రాజెక్టుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, స్మార్ట్ సిటీ, కుడా ఇంజనీరింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్ చార్ట్ సౌకర్యం కల్పించేలా చర్యలు

ప్రజాశక్తి - కోటనందూరు

గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన మహిళా పోలీసులకు జాబ్‌చార్ట్ సౌకర్యాన్ని కల్పించాలని సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు నారిపిరెడ్డి వేణమ్మ అన్నారు. గురువారం స్థానికంగా మండల సచివాలయ మహిళా పోలీసుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. పంచాయతీ రాజ్, మున్సిపల్, రెవెన్యూ ఇతర శాఖలకు సంబంధించి ఏకకాలంలో పలు రకాల పనులు అప్పగిస్తున్నారని, లక్ష్యాలకు అనుగుణంగా పని కాకపోతే షోకాజ్ నోటీసులు ఇస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. సరైన జాబ్ చార్ట్ లేకపోవడం వల్ల ఏ పని చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. సెలవు కోసం ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న ఇతర శాఖల ఉద్యోగులకు నిర్దిష్టమైన పని విధానంతో ముందుకు వెళ్తున్నారని, మహిళా పోలీసులకు మాత్రం ఆ పని విధానం లేదన్నారు. ప్రజా ప్రతి నిధులు, అధికారులకు తమ సమస్యలను తీసుకెళ్లినా స్పందన లేదని అన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు స్పందించే తమకు న్యాయం చేయాలన్నారు.

పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు గంగరాజు మృతి

ప్రజాశక్తి - కాజులూరు

నివాకులర్పిస్తున్న మాజీ మంత్రి చిక్కాల

సీనియర్ టిడిపి నాయ కులు, కాజులూరు సహకార సంఘ మాజీ అధ్యక్షులు వెలుగుబంట్ల గంగ రాజు(72) మృతి చెందారు. గురువారం ఉదయం వాకింగ్ అనంతరం ఇంటికి వచ్చిన కొద్దిసేపటికి కుప్పకూలి పోవడంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నింగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1983 నుంచి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపేవారు. సహకార సంఘ అధ్యక్షుడుగా రైతులకు అనేక సేవలు అందించారు. గంగరాజు మరణ వార్త తెలియగానే మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు హుటాహుటీన కాజులూరు వచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సంతాపం వ్యక్తం చేశారు. సహకార సంఘం మాజీ అధ్యక్షులు యాళ్ళ వెంకటరమణ, యాళ్ళ కాసులు, వెలుగుబండ్ల సతీష్, సలాది నానాజీ నివాళులర్పించారు.

అన్నదాన పథకానికి రూ.1.11 లక్షల విరాళం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు రూ.1,11,600 విరాళం అందించారు. గురువారం హైదరాబాద్‌కి చెందిన పుణ్యమంతుల సత్యనారాయణ దంపతులు విరాళంకు చెందిన చెక్కును ఇఒ వీర్ల సుబ్బారావుకి అందజేశారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 18వ తేదీన తమ పేరున భక్తులకు అన్నదానం వితరణ చేయాలని కోరారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి రెండు నామినేషన్లు

ఐదుకు చేరిన నామినేషన్ల సంఖ్య - శని, ఆదివారాలు సెలవు దినాలు - మరో రెండు రోజులు మాత్రమే మిగిలిన గడువు

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు కలెక్టరేట్‌లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు, కాకినాడకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి కాట్రు నాగబాబులు ఒకొక్కరు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ఈ నెల మూడో తేదీ నుంచి ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఎన్నికల విభాగం తహశీల్దార్ చల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదు

ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌లో పేర్కొంది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు రావడంతో ఈ రెండు రోజులు నామినేషన్ల స్వీకరణ ఉండదని పేర్కొంది. దీంతో ఏడో తేదీ శుక్రవారం, ఆఖరి రోజు పదోతేదీ సోమవారం రెండు రోజులు మాత్రమే నామినేషన్లకు గడువు మిగిలి ఉంది. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పదో తేదీన నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

నామినేషన్‌కు బయల్దేరిన ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు

ప్రజాశక్తి - ఆలమూరు, ముమ్మిడివరం

తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పిడిఎఫ్, యుటిఎఫ్ సంఘాలు బలపరిచిన ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు నామినేషన్ వేసేందుకు బయలు దేరారు. మండలంలోని జొన్నాడ సెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కాటన్ దొర విగ్రహాలకు గురువారం ఉదయం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే స్థానిక యుటిఎఫ్ నేతలతో కలిసి ర్యాలీగా ఏలూరు నామినేషన్ వేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ పట్టభద్రుల విషయంలో ఎంఎల్‌సి అభ్యర్థిగా నన్ను బలపరిచి నాపై ఉంచిన నమ్మకానికి వమ్ము చేయకుండా బాధ్యత పరంగా ఉంటానని తెలిపారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యుటిఎఫ్‌లో వివిధ బాధ్యతలు చేపట్టి ముందుకు సాగినట్లు తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థిగా నన్ను బలపరిచినందుకు పిడిఎఫ్, యుటిఎఫ్ ఉద్యమ ప్రజా సంఘాలకు ఆయన ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, యుటిఎఫ్ సీనియర్ నేతలు వైవివి.రమణ, పివివిజివిఎస్ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముమ్మిడివరం మండల నుంచి సివిటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బళ్ళగేటు సెంటర్ నుంచి ఏలూరుకు పలువురు ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఔతరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో దొమ్మేటి వీర రాఘవులు, వెంకట్రావ్, రాంబాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు అందని 'సడక్' నిధులు

ప్రజాశక్తి - కాకినాడ

విలీన గ్రామాలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం నిధులు లేకుండా పోయాయని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో అన్నారు. విలీన గ్రామాలు తూరంగి, ఇంద్రపాలెం, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, చీడిగ, స్వామినగర్, టీచర్స్ కోలనీలు పౌర సౌకర్యాల లేక ప్రగతికి దూరంగా ఉంటున్నాయని అన్నారు. తక్షణమే ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావుల్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడనందని విద్యుత్ శాఖ ఇఇ బి.వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కాట్రావులపల్లి, ఎర్రంపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరగనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాడికి కూటమి ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ముద్రగడ ఇంటిపై దాడికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎంఎల్‌సి కుడిపూడి సూర్యానారాయణ, మాజీ ఎంపి మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. గురువారం కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను వారు పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఇంటిపై జనసేన పార్టీ అభిమాని దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముద్రగడ ఇంటిపై జరిగిన దాడి ఘటన అయి 4 రోజులు కావస్తున్నా నేటికీ విచారణ పూర్తి చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. జనసేన పార్టీ అభిమాని దాడి చేసినట్లు స్పష్టంగా తెలిసినా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మౌనం వహించడం దారుణమన్నారు. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని గుర్తుంచుకుంటే మంచిదని అన్నారు. ముద్రగడను కలిసిన వారిలో కాపు నాయకులు నల్లా విష్ణు, చినమిల్లి వెంకటరాయుడు, తోట రామకృష్ణ, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



జిజిహెచ్ అభివృద్ధికి కృషి చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిజిహెచ్ వైద్య అధికారులు, ఆరోగ్యశ్రీ, ఇతర విభాగాల అధికారులతో గత నెలలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమావేశంలో తీర్మానించిన అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఆరోగ్య వైద్య సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైద్య అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. అందుబాటులో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. ప్రధానంగా జిజిహెచ్ సమగ్ర అభివృద్ధికి వివిధ విభాగాల అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేసి వైద్య సేవలను నాణ్యతను పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ పి.రాధాకృష్ణ, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట, కాజులూరు, కరప

సామర్లకోట మండల పరిధిలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలనకు ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ ఎఒ ఇమ్మిడిశెట్టి సత్య చెప్పారు. గురువారం అమె వివిధ రైతులతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో ప్రతి రైతు సేవా కేంద్రం సిబ్బందికి సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. అలాగే కాజులూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులతో సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ ఎఒ వి.అశోక్ మాట్లాడుతూ మండలంలో ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కరప మండలంలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణకు మందు పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ ఎఒ రాజేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్థానికులకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న గ్రామాల్లో ఉన్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రాఘవవట్పం గ్రామంలో సర్వేనెంబర్ 158లో సుమారు 6.12 హెక్టార్లలో రోడ్డు మెటల్ క్వారీ తవ్వకాలకు సంబంధించి ఎంఆర్ ఇండియా లిమిటెడ్ చేసుకున్న దరఖాస్తుపై డిఆర్ఓ వెంకట్రావు అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న గ్రామాల్లో యువ తకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రౌతులపూడి ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సదుపా యాలు కల్పించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని అన్నారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ శంకర్రావు, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

వాహనదారులకు జరిమానా

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో నిబంధనలను అతిక్రమించిన ద్విచక్రవాహనదారులకు పోలీసులు జరిమానాలు విధించారు. గురువారం నగరంలోని వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సిఐలు ఎన్.రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత మాసోత్సావాల్లో చేపట్టిన తనిఖీల్లో 15 మోడిఫైడ్ సైలెన్సర్ వాహనాలు, సెల్‌ఫోన్ డ్రైవ్ చేయటం, అతి వేగంగా వాహనం నడపటం, త్రిబుల్ రైడింగ్ చేస్తూ ప్రయాణిస్తున్న మొత్తం 40 మోటార్ సైకిల్ వాహనదారులను ట్రాఫిక్ స్టేషన్‌లకు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. జరిమానాలు విధించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను డ్రైవ్ చేస్తే కేసులు తప్పవని వారు హెచ్చరించారు.

సెల్ ఫోన్ దొంగ అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలించి పరారౌతున్న వ్యక్తిని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగరావు అరెస్టు చేశారు. గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సెల్ఫోన్ చోరీ చేసి మరో చోరీకి దొంగ ఎదురు చూస్తున్న సమయంలో సెల్‌ఫోన్ పోయిందని ఇద్దరు మహిళలు ట్రాఫిక్ ఎస్ఐ గరగారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన పోలీస్ అవుట్ పోస్టులో ఉన్న సిసి కెమెరాలు పరిశీలించగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో హుటాహుటీన వెళ్లి ఆ వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. సెల్‌ఫోన్ పోయిందని అనుకున్న ఆ మహిళలకు అప్పటికప్పుడే సెల్‌ఫోన్ లభించడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలకు పాల్పడిన వారిని గుర్తించేందుకు దోహదం చేస్తాయని అన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా 36 లీటర్ల సారాను స్కూటీపై తరలిస్తుండగా స్కూటీని, సారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాటి చెట్టుపై కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కరప

కరప గ్రామంలోని కల్లుగీత కార్మికుడు తాటిచెట్టుపై గుండెపోటుతో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం సాయంత్రం రామ కంచి నగర్ కాలనీ వద్ద కల్లుగీత కార్మికుడు పెంకె శ్రీనివాస్(43) తాటి చెట్టు పైకెక్కి కల్లు గీస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఈ సంఘటన గమనించిన స్థానికులు చెట్టుపైకెక్కి కిందకు దింపారు. కానీ అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు తెలిపారు. మతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ పరంగా కల్లుగీత కార్మికుడిని ఆదుకోవాలని పలువురు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - అల్లవరం

కొమరగిరిపట్నం గ్రామంలోని ఓ హేచరీలో ఆదివారం రాత్రి జరిగిన పార్టీలో అసాంఘిక కార్యకలపాలు జరగడంపై పోలీసులు కేసు నమోదుచేశారు. వైరల్ అయిన వీడియో ఆధారంగా ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ గురువారం తెలిపారు. జూదాలు, కోడి పందేలు నిర్వహించిన నిర్వాహకులతోపాటు, హేచరీ యజమానిపై కేసులు నమోదు చేశారు. కొమరగిరిపట్నంలోని ఓహేచరీలో జూదాలు, కోడిపందేలు జరుగుతున్న వీడియో సోషల్ మీడియా వేదికగా చక్కర్లు కొట్టింది.. అదేవిధంగా మీడియాలోనూ పలు కథనాలు రావడంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. వీడియో ఆధారంగా అసాంఘిక కార్యకలాపాలు పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెరవలి

వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామానికి చెందిన బల్ల బాలయోగి సుబ్బారావు ఈ నెల 2వ తేదీన పెరవలి మండలం కానూరులో సోదరి ఇంటికి వచ్చాడు. తిరిగిన వేడంగిపాలెం గ్రామానికి వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అయితే ఆ గ్రామానికి రాకపోవడంతో కుటుంబికులు పలు చోట్ల వెతికారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 9440796642 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

యానాం వార్తలు

హోంమంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

పలువురు మంత్రులను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం పలువురి మంత్రులను కలిశారు. తొలుత హోంమంత్రి నమశ్శివాయ ను కలిసి మాట్లాడారు. విద్యా శాఖలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్లకు రూ.18 వేలు జీతం పెంచుతున్నట్లు గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారని, కానీ ఇప్పటివరకు వారికి జీతాలు పెంచలేదని, తక్షణమే పెంచాలని కోరారు. ఇప్పటికే గవర్నర్ దృష్టికి తీసుకెళ్లానని వివరించారు. త్వరలోనే మిల్క్ బాయిలర్స్‌కు ప్రభుత్వం తీపి కబురు చెబుతుందని హోంమంత్రి చెప్పారని ఎంఎల్ఎ తెలిపారు. అలాగే టిజిటి ఉపాధ్యాయులను ప్రతీఏటా వారిని రెన్యువల్ పద్ధతిలో ఉపాధి కల్పిస్తున్నామని, వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. పేరా టీచర్స్‌కి సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలని, పలు ప్రభుత్వ పాఠశాలను విలీనం చేసే ఆలోచనలు విరమించుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తక్షణమే ధరలను తగ్గించాలని కోరినట్లు ఆయన తెలిపారు. అలాగే ఆది ద్రావిడ శాఖ మంత్రి సాయి శరవణన్‌ను కలిసి పలు సమస్యలు వివరించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. శాఖలో కోటి రూపాయలు నిధులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకుని పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని కోరారు. గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో యానాం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ కృష్ణారావు శిక్షణ ఇచ్చారు. మహిళా సాధికారతపై యానాం ఉమా ఇండస్ట్రీస్ ప్రతినిధులు పిల్లి ఉమామహేశ్వరి, ఆదిలక్ష్మి అవగాహన కల్పించారు. ఎంబ్రాయిడరీ, కుట్టు ద్వారా డిజైనింగ్ వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ చెల్లి నరేష్, ఎస్.శ్రీనివాస్, వివిధ ప్రయివేటు ఆసుపత్రుల వైద్యులు డాక్టర్ ముత్యాలు, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ శ్రీదేవి, కాజాబి, జయభారతి పాల్గొన్నారు.

యానాంలో పర్యటించిన పుదుచ్చేరి డిఐజి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డిఐజి ఆర్.సత్యసుందరం గురువారం యానాంలో పర్యటించారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు సంక్షేమంపై ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు పాల్గొన్నారు.

పంట భూములను పరిశీలించిన ఆర్ఎఒ

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలోని పంట భూములకు తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో గురువారం ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి పంట భూములు పరిశీలించారు. ప్రజాపనుల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు అలాగే దరియాలతిప్ప రైతులు గ్రామస్థులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. రైతులను సాగునీటి ఎద్దడికి సంబంధించి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల పంటచేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుని పంట చేలను కాపాడాలని రైతులు కోరారు.

500 మామిడి మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఖరీదైన 500 మామిడి మొక్కలను గిరియంపేట ప్రజలకు గురువారం పంపిణీ చేశారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పొల్యూషన్ కంట్రోల్ ఆఫీసర్ ఇళంగోవన్ చేతుల మీదుగా వారికి అందజేశారు. కొన్ని మొక్కలను ఆయా ప్రాంతాల్లో నాటారు.



వైసిపి కార్యకర్తలతో ముద్రగడ గిరిబాబు

త్వరలోనే గ్రామాల్లో పర్యటిస్తా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో త్వరలోనే పర్యటిస్తానని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురువారం కిర్లంపూడిలో ఆయనను నియోజకవర్గంలోని అప్పనపాలెం, ఉత్తరకంచి, గ్రామాల వైసిపి కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత వైసిపి కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంకు శ్రీను, గొల్లపల్లి కాశి, రామిశెట్టి నాని, సకురు గుర్రాజు, గొల్లపల్లి దొరబాబు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీలో కేన్సర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. గురువారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ రేడియేషన్ వైద్యులు డాక్టర్ ఎం.పృథ్వీరాజ్ పాల్గొని మాట్లాడారు. పురుషులు, స్త్రీలు, పిల్లల్లో వచ్చు కేన్సర్ యొక్క లక్షణాలను, వాటిని ఏవిధంగా గుర్తించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు ముందుగా కేన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం వలన కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించి మెడికేషన్ తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయట పడవచ్చునని అన్నారు. బయట ఫుడ్‌లో ఎక్కువగా నూనెలో వేయించే పదార్థాలు తినడం వలన కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ కేన్సర్ మన చెడు అలవాట్ల కారణంగా వస్తుందని, యువత ఆ చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని వివరించారు. ఈ సదస్సులో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ప్రశాంతి, జె.అనుప్రవల్లిక, ఎస్.శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయంలో ఈనెల 24వ తేదీ నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో యాత్రికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ట్రైనీ కలెక్టర్, ఇండిపెండెంట్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్‌భావన ఆదేశించారు. గురువారం స్థానిక భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వేల సంఖ్యలో ప్రతిరోజు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, ఏర్పాట్ల విషయంలో అధికారులు ఎలాంటి అశ్రద్ధ చూపకుండా ఉండాలన్నారు. భక్తుల దర్శనానికి ఏర్పాటు చేసే క్యూ లైన్లతోపాటు భక్తుల సౌకర్యార్థం స్నాన ఘట్టాల వద్ద గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం ఆలయ పరిసరాల్లో విద్యుత్తు సరైన రీతిలో ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ అధికారి బల్ల నీలకంఠం మాట్లాడుతూ యాత్రికులకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, సిఐ ఎ.కృష్ణభగవాన్, అగ్నిమాపక అధికారి ప్రసాద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర మరువలేనిది

ప్రజాశక్తి - కాకినాడ

రిటైర్డ్ అధ్యాపకులు, ఉద్యోగులతో ఇన్‌ఛార్జ్ విసి

జెఎన్‌టియుకె అభివృద్ధిలో రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జ్ విసి కెవిఎస్. మురళీకృష్ణ అన్నారు. గురువారం యూని వర్సిటీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు అందరూ పరస్పరం సహకరించుకుని స్నేహ పూర్వక వాతావరణంలో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.అనంతరం రిటైర్డ్ అధ్యాపకులను, నాన్ టీచింగ్ ఉద్యోగులను ఆయన శాలువాతో సత్కరించారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా విందు ఏర్పాటు చేసిన ప్రొ వివి.గంగాధర శాస్త్రిని అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పి. విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొ వి.రవీంద్రనాథ్, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ జి.రఘురామ్, ఉపాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ ఎం. వీరన్న, సెక్రటరీ సిహెచ్.వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పి.రామారావు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భారతీయులపై ట్రంప్ చర్యలు దారుణం

ప్రజాశక్తి - జగ్గంపేట

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయులపై అమానుష చర్యలు దారుణంగా ఉన్నాయని ఎపి రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో అనధికారికంగా ఉంటున్నారని 205 మంది భారతీయులకు కాళ్లు, చేతులకు సంకెళ్ళు వేసి ఇండియాకు పంపించడం దారుణమన్నారు. భారతీయుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన ట్రంప్ తీరును భారత ప్రభుత్వం ఖండించక పోవడం సిగ్గు చేటన్నారు. అమెరికా నుంచి వచ్చిన వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించి తక్షణం వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, నాయకులు రామలింగేశ్వరరావు, సురేష్, జాన్, కడితి సతీష్ పాల్గొన్నారు.

గుండెపోటు బాధితులకు అందుబాటులో ఇంజక్షన్

ప్రజాశక్తి - కాకినాడ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

గుండెపోటు బాధితులకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందుబాటులో ఉందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గుండెపోటు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్‌ను డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్.స్వప్నతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని ఏరియా ఆసుపత్రితో పాటు జిల్లాలో ఉన్న 9 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గుండెపోటు బాధితులకు అందించే ఇంజక్షన్ అందుబాటులో ఉందన్నారు. గుండె నొప్పి గురైన వారికి హబ్ అండ్ స్ట్రోక్ విధానంలో రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు గుండె నొప్పికి గురైన 82 మందికి ఈ ఇంజక్షన్ అందించామని ఆయన తెలిపారు. గుండె నొప్పికి గురయ్యే వారు తొలి గంట సమ యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందిం చాల్సిన వైద్య సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

త్వరితగతిన రీ సర్వే పూర్తికి చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

పైలెట్ ప్రాజెక్టుగా కోలంక గ్రామంలో చేపట్టిన రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ సూచించారు. గురువారం మండలం లోని కోలంక, పెదలంక, నామవానిపాలెం గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలంక రెవెన్యూ పరిధిలో 3067 ఎకరాల సాగుభూమి ఉందని, రీ సర్వే చేయడానికి 11 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు 20 ఎకరాల సర్వే పూర్తయ్యేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కరానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేగేశ్వరరావు, రీసర్వే డిటి చందన, విఆర్ఒలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ శ్రీలలితకు సత్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎంపిడిఒను సత్కరిస్తున్న సిబ్బంది

ఎపి పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపిడిఒ డి.శ్రీలలితను గురువారం కార్యాలయ సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సత్కార కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే సత్యవతి, పలువురు ప్రజాప్రతి నిధులతోపాటు, కార్యాలయ పరిపాలనాధికారి ఎం.సత్యనారాయణమూర్తి, ఇఒపిఆర్‌డి రమణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెటీరియల్‌ను పంపణీ చేస్తున్న నిర్వాహకులు

10వ తరగతి పరీక్ష మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కరప

యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూరల్ మండలం పెనుమర్తి గ్రామంలో ఉన్న శారద విద్యాలయం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ జరిగింది. మెటీరియల్‌ను పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యంగ్ మైండ్స్ ఫౌండర్ వాకాడ వెంకటరమణ చిన్న, రావు, రాజేంద్ర, వైస్ ప్రిన్సిపల్ నూకరాజు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలను సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ఉపాధి హామీ పథకంలో కూలీలకు కొలతల ప్రకారం పని చేసి రూ.300 వేతనం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. గురువారం మండలంలోని మురారి గ్రామంలో చేపట్టిన ఉపాధి పథకం పనులను ఆమె పరిశీలించారు. చెరువు పనికి వచ్చిన వేతనదారులు మస్తర్లు, మురారి గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం రానున్న నేపథ్యంలో కూలీలకు అవసరమైన పనిని కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, ఇసి రమేష్, శ్రీనుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పితానికి జెడ్‌పిటిసి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మాతృవియోగంతో బాధపడుతున్న వైసిపి నాయకులు పితాని బాలకృష్ణను తాళ్ళరేవు జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొపనాతి నాగరాజు, బొంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

డివిజనల్ పంచాయతీ కార్యాలయం, గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణాల కోసం ఎంపిక చేసిన స్థలాలను ఆర్‌డిఒ శ్రీరమణి గురువారం పరిశీలించారు. ఈ పర్యటనలో డిఎల్‌పిఒ ఎం బాలామణి, డిటి కాంతారావు, మండల సర్వేయర్ సామోరు, సిబ్బంది పాల్గొన్నారు.

3,500 మందికి కూలి పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో ప్రతిరోజు 3500 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి పనులు కల్పించాలని ఎంపిడిఒ శ్రీలలిత ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ప్రవేశిస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించవలసి ఉందన్నారు. ఎపిఒ డి.సుదీర్ మాట్లాడుతూ మండల పరిధిలో గురువారం 1968 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొన్నారన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, పంట కాలువల పూడిక తీత పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు కె.దుర్గాప్రసాద్, వై.బాబూజీ, ఎం.సత్తిరాజు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పాడ-1 విఆర్ఒ పి.రాంబాబు(45) గురువారం మృతి చెందారు. అనారోగ్య కారణంగా గతంలో ఆయనకు కిడ్నీ తొలగించారు. నాటి నుంచి వివిధ ఆసుపత్రుల్లో వైద్యం పొందినా ఆరోగ్యం కుదుట పడలేదు. గత 3 నెలల నుంచి ఆయన మంచానికే పరిమితం అయ్యారు. ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందారు. రాంబాబు అకాల మృతి తమను ఎంతగానో బాధించిందని ఉప్పాడ-2 విఆర్ఒ సురేష్ అన్నారు.

భద్రతకే తొలి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ

ప్రయాణికుల భద్రతకే ఆర్‌టిసి తొలి ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం డిపోలో ఫ్యామిలీ కౌన్సిలింగ్‌పై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన డ్రైవర్లు బస్సులు నడిపే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలను అరికట్టడానికి కావలసిన నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ శివారెడ్డి, మెడికల్ ఆఫీసర్ పద్మావతి, ఎంవిఐ.హరినాథ్‌రెడ్డి, ఎఎంవిఐ సాయిబాబు, డిపో మేనేజర్ ఎంయువి.మనోహర్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

My old name is **DOKUBURRA SUBRAHMANYAM,** Son of DOKUBURRA MERY and DOKUBURRA RAJU. My parents died. After Adoption my changed name is SUBRAHMANYAM HUGHES, Son of CAROLYN DELIGHT WILLIAMSON and MICHAEL RANDOLPH HUGHES. Since today on wards myself with my parents are called as SUBRAHMANYAM HUGHES, Son of CAROLYN DELIGHT WILLAMSON and MICHAEL RANDOLPH HUGHES.

SUBRAHMANYAM HUGHES
D.No. 7-95/A, SC Peta
Pedapudi Village & Mandal
Kakinda Dist., Call: 98664 48709

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 30/2019

Between:
Pesangi Srinu and Others
(3 and 4 Petitioners are being minors represented by their Father and natural guardian Pesangi Srinu P1) ...Petitioner
AND
Undru Narasimha Murthy and Others
...Respondents

Notice to Respondent:
R-1: Undru Narasimha Murthy, S/o. Saheb, age 40 years, Thimmarajapuram, Tallarevu Mandal, E.G.Dt., Pin: 533461. (Driver of Tractor cum Trailer bearing Regd. No. AP 05 BV 0693 & AP 05 TA 7251)

In the above M.V.O.P. No. 30/2019 the 1st Respondent hearing date stand posted **to 14-02-2025 at 10.30 A.M.** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party